డిగ్రీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అధికారులు, కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దేవరకద్ర, జూన్ 24 : కొత్తగా ఏర్పాటు చేసే డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధ్యాపక బృందంతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. వివిధ కోర్సులో చేరేందుకు 240సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 28వ తేదీ వరకు దోస్త్‌యాప్‌లో వెబ్‌ఆప్షన్‌లో నమోదు చేసుకోని, అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ఊర్మిళ తదితరులు ఉన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థన

మండల కేంద్రంలోని జామేమజీద్ ఆవరణలో ఉన్న మల్లెబారి సాహెబ్‌వారి ఉర్సేషరీఫ్ మహోత్సవ సందర్భంగా గంధోత్సవాన్ని పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సయ్యద్‌అంజద్‌అలీ, ఫారుక్, మిల్, గౌస్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, మాజీజెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైఫిల్‌షూట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

గురుకులంలో రైఫిల్ షూటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

బాలానగర్, జూన్ 24: విద్యార్థులు సంస్కారవంతమైన చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం బాలానగర్‌లోని బాలికల గురుకులంలో ఏర్పాటు చేసిన రైఫిల్ షూట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులకు రైఫిల్ షూటింగ్‌లో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో రూ.4లక్షల వ్యయంతో గురుకులంలో రైఫిల్ షూటింగ్‌ను ఏర్పాటు చేసినట్లు గురుకులం క్రీడా అధ్యాపకురాలు అరుణ తెలిపారు. పదో తరగతి విద్యార్థి రమ్య, ఇంటర్ చదువుతున్న మీనాక్షికి గచ్చిబౌలి క్రీడా ప్రాంగణంలో రైఫిల్ షూటింగ్‌పై శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. గురుకులం ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సౌమ్య, కరుణశ్రీ, మంజుల తదితర అధ్యాపకులు, శంకర్‌నాయక్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, హరిసింగ్‌నాయక్, ఎంపీటీసీ వెంకట్‌రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం కొనుగోలుదార్ల పేర్లను నమోదు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్సై సుష్మ

దేవరకద్ర, జూన్ 24 : మండలంలోని కిరాణషాపు యజమానులు బెల్లం కొనుగోలు దారుల పేర్లను తప్పనిసరిగా నమోదు చేయాలని మహబూబ్‌నగర్ ఎక్సైజ్ ఎస్సై సుష్మ అన్నారు. సోమవారం తాసీల్దార్ కార్యాలయంలో పట్టణంలోని కిరాణషాపు యజమానులతో తాసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సారాతయారిని అరికట్టేందుకు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. దుఖానదారులు షాపులో బెల్లం కొనుగోలుదారుల పేర్లు, వారి ఆధార్, ఫోన్ నెంబర్లను నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి నుంచి ఎక్సైజ్ అధికారులు వచ్చినప్పుడు రికార్డులను చూపించాలన్నారు. రికార్డు లేకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో షాపు యజమానులు, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలికవసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

- రేపు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న సతీశ్

పాలమూరు, జూన్ 24: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం తమ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కన్వీనర్ సతీశ్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలను త్వరగా పూర్తి చేయలేకపోయిందన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ప్రైవేట్ పాఠశాలలు రోజు రోజుకూ పెరుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివ, అరవింద్, గణేశ్, కార్తీక్, వరుణ్, అరుణ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

మాగనూరు, జూన్ 24: ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను తప్పకుండా పెంచేందుకు కృషి చేయాలని నేరడగం కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకరాచారి చెప్పారు. సోమవారం వర్కూర్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గతంలో కంటే తక్కువగా ఉందని ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ ఎల్లా గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్చరిక

నా క్లైంటు టి.కె.రఘురాజు తండ్రి కీ॥శే॥ దివాకర్, తాటికొండ నివాసము, భూత్పూర్ మండలము, మహబూబ్‌నగర్ జిల్లా అను వారు ఇచ్చిన సమాచారము ప్రకారము, యావన్మందికి తెలియచేయునది ఏమనగా, తాటికొండ గ్రామ శివారు పొలము విస్తీర్ణము ఎ.03-00గుంఠ, సర్వే నెం.532, సదరు పొలము నా క్లైంటుకు వారసత్వముగా సంక్రమించినది. ఇట్టి పొలమును ఆక్రమించదలచి తప్పుడు దస్తావేజులు సృష్టించి హేలత తండ్రి రాజయ్య అనువారు అమ్ముటకై ప్రయత్నించుచుండగా గమనించిన నా క్లైంటు, గౌరవ ఆర్.డి.ఓ., మహబూబ్‌నగర్ గారి దగ్గర అప్పీలు వేసి సృష్టించిన దస్తావేజులు రద్దు చేయించినారు . ఇట్టి విషయమును దాచిపెట్టి కొత్తగా వచ్చిన తహశీల్దార్ భూత్పూర్ మండలము గారి నుండి దస్తావేజులు పొందినారు. అట్టి విషయము గమనించిన నా క్లైంటు గౌరవ జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్ గారి అనుమతితో సదరు దస్తావేజులు అమలును నిపేదించినారు. ఇట్టి విషయమును దాచిపెట్టి హేలత అను వ్యక్తి సదరు పొలమును అమ్ముటకు ప్రయత్నించుచున్నట్లుగా తెలియవచ్చినది. ఇది పూర్తిగా చట్ట విరుద్ధము. సదరు హేలత అనువారికి పొలమును అమ్ముటకు ఏలాంటి అధికారము లేదు. అతిక్రమించిన వారికి ఏలాంటి హక్కులు సంక్రమించవు సరికదా క్లైంటు తదుపరి తీసుకునే చట్టపరమైన చర్యలకు పూర్తి బాధ్యులు అగుదురు. అని ఈ ప్రకటన ద్వారా హెచ్చరించుచున్నాము.
తేదీ: 25-06-2024
స్థలము: మహబూబ్‌నగర్

నీలినర్సప్ప, న్యాయవాది
పలుకగిరి, న్యూప్రేమ్‌నగర్, మహబూబ్‌నగర్

బదిలీలు, ప్రమోషన్లలో సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేటరూరల్, జూన్24: బదిలీలు, ప్రమోషన్లలో సాంకేతిక సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూటీఎస్ నాయకులు డీఎస్‌ఈ జేడీ మదన్‌మోహన్‌యాదవ్‌ను కోరారు. సోమవారం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్‌ల ప్రక్రియను పరిశీలించేందుకు డీఎస్‌ఈ జేడీ పేటకు వచ్చారు. డీఈవో కార్యాలయంలో వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మద్దూర్ మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్ జేడీని కలిసి, సమస్యను విన్నవించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- సమీక్షలో కలెక్టర్ విజయేందిర

ప్రజావాణి దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 24: ప్రభుత్వ ప్రాధాన్యత, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పలు పథకాలు అమలుపై సమీక్షించి.. మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు మురుగునీరు నిల్వ ఉండకుండా శుభ్ర పరచాలని, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అధికారులకు సూచించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా 1, 11, 21వ తేదీల్లో ఓహెచ్‌ఎస్‌ఆర్ చల్లి ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల మౌలిక వసతులు, ఈ ఆఫీస్ పెండింగ్ ఫైళ్లు, కలెక్టరేట్, సర్వే ల్యాండ్ రికార్డు, పంచాయతీ, యువజన క్రీడలు, పశుసంవర్ధక శాఖ, షెడ్యూల్డ్ కులాలు, వైద్య, ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ద్వారా పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, డీఆర్‌వో రవికుమార్, జెడ్పీ సీఈవో రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 24: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి త్వరగా పరిష్కరించాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాలకు చెందిన 109మంది పలు సమస్యలపై కలెక్టర్, అదనపు కలెక్టర్లకు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జాప్యం లేకుండా పరిష్కరించాలని తాసీల్దార్, ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు ఎక్కువగా రెవెన్యూ, ల్యాండ్ సర్వే, రికార్డ్స్, పెన్షన్, డబుల్‌బెడ్‌రూం, ఎస్సీ, ఎస్టీ, బీసీస్ సంక్షేమ శాఖకు సంబంధించినవి ఉన్నాయని తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, జూన్ 24: ప్రజావాణిలో దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులు ఆదేశించారు. సోమవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలతో దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. మొత్తం 75 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఎక్కువగా భూ సంబంధిత సమస్యలపైనే ఉన్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో మధుమోహన్ పాల్గొన్నారు.

ప్రత్యేకశ్రద్ధ చూపాలి..

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అ న్నారు. పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో తాసీల్దార్‌ల తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, రెవెన్యూ శాఖకు చెడ్డపేరు వచ్చే పనులు చేయరాదన్నారు. ప్రతిదరఖాస్తు ఆర్డీవో, రెవెన్యూ కలెక్టర్ ద్వారానే రావాలన్నారు. తాసీల్దార్‌లు సమయపాలన పాటించాలని, కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఆన్‌లైన్ ఇసుక వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో మధుమోహన్ పాల్గొన్నారు.

నియామకాల ప్రక్రియ కొనసాగుతుంది

నారాయణపేట టౌన్, జూన్ 24: మెడికల్ కళాశాలలో నియామకాల ప్రక్రియ కొనసాగుతుందని కలెక్టర్ సిక్తాపట్నాయక్ స్పష్టంచేశారు. సోమవారం పట్టణంలోని జనరల్ దవాఖానలో నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు సంబంధించిన ఐదుగురు సెంట్రల్ టీం సభ్యులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలకు సంబంధించిన నియామకాలు, ఇతర అంశాలపై వివరించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా నియామకాలు ఆలస్యంగా కొనసాగుతున్నాయన్నారు. బయోమెట్రిక్ హాజరు, ఫ్యాకల్టీ, ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినందున త్వరలోనే నియమిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, జిల్లా పరిపాలన తరపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సమావేశంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ టీం సభ్యులు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్, సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్, డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

గౌరవంపెంచేలా పోలీసు విధులు

బాధితుడి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ యోగేశ్

- పేట ఎస్పీ యోగేశ్ గౌతమ్

నారాయణపేట, జూన్ 24: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచరాదని ఎస్పీ యోగేశ్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం పట్టణంలో ని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో మొత్తం 12 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. చట్టప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలన్నారు.

ప్రజలకునాణ్యమైన సేవలందిస్తాం

- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, జూన్ 24: జిల్లా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి పోలీసుల గౌరవం మరింత పెంచేవిధంగా కృషి చేస్తామని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాఫిర్యాదులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో ద్వారా మాట్లాడి ఫిర్యాదుదారులకు సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

బాలానగర్, జూన్ 24: జిల్లాలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని ఎస్పీ జానకి అన్నారు. సోమవారం సాయంత్రం ఆమె బాలానగర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్లో రికార్డు అయిన వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. బాలానగర్ పోలీస్‌స్టేషన్లో సిబ్బంది తక్కువగా ఉందని, సిబ్బందిని పెంచేందుకు ప్రయత్నిస్తానన్నారు.

బాలానగర్ ఠాణాలో దస్త్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ

భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- తాసీల్దార్, డీఈవో కార్యాలయాల్లో వినతి

నారాయణపేట, జూన్ 24: మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రాం అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ పార్కు వద్ద మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తాసీల్దార్ నారాయణ, డీఈవో కార్యాలయ అధికారి యాదయ్య శెట్టికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జోషి, నాయకులు జయంతి, తిరుపతమ్మ, మణిమాల, వెంకటమ్మ, రాధ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నిక ఏకగ్రీవం

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 24: పాలమూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి టైటస్ పాల్ తెలిపారు. 12 డైరెక్టర్ పోస్టులకు 17 నామినేషన్లు రాగా అందులో ఐదుగురు విత్‌డ్రా చేసుకోవడంతో డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడు కండే కుమార స్వామి, ఉపాధ్యక్షులు కృష్ణయ్య, సూర్యనారాయణ, డైరెక్టర్లు తమ్మయ్య, కన్నయ్యశెట్టి, జ్యోతి, సంఘమేశ్వర్, శ్రీనివాస్, నాగలక్ష్మి, తిరుపతయ్య, రామ్మోహన్, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలి

భూత్పూర్, జూన్ 24 : మండలంలోని వెల్కిచర్లకు చెందిన మాదిగ యువశక్తి సంఘం సభ్యులు సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో కలెక్టర్ జయేందిర బోయికి వినతి అందజేశారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో వెల్కిచర్లకు ఎస్సీ రిజర్వేషన్ అవకాశం కల్పించాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మాదిగ యువశక్తి సంఘం అధ్యక్షుడు చెంద్రాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

ఊట్కూర్, జూన్ 24: మండలంలోని నిడుగుర్తి యూపీఎస్‌లో చిన్నారులకు సోమవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చదువుల తల్లి సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఎంఈవో వెంకటయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని కుసుమ పాల్గొని మాట్లాడారు.

జల్సాల కోసం చోరీలు

- ఇద్దరు దొంగలకు రిమాండ్
- 5.5తులాల బంగారం, 1.5తులాల వెండి, మొబైల్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ లింగయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట, జూన్ 24: జల్సాల కోసం చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను పట్టుకుని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ లింగయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మాగనూర్ మండలం వర్కూర్‌లో ఈనెల 20న అర్ధరాత్రి తాళం వేసి ఉంచిన రెండు ఇండ్లలో తాళాలు పగులగొట్టి దుండగులు బంగారు, వెండి వస్తువులు, మొబైల్ ఫోన్ చోరీ చేశారు. ఇంటి యజమాని సుజాత ఫిర్యాదు మేరకు 21న మాగనూర్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం ఉదయం నల్లగట్టు మారెమ్మ ఆలయం వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వారిని పట్టుకొని విచారించారు. వారిలో ఓ యువకుడు వర్కూర్‌కు చెందిన నరేశ్, మరొకరు కర్నూల్ జిల్లా దేవనకొండకు చెందిన వీరేంద్ర. కాగా వీరు జల్సాలకు అలవాటుపడి చోరీలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 19న వర్కూర్ గ్రామానికి వచ్చిన వీరు రెక్కీ నిర్వహించి తాళాలు వేసిఉన్న ఇళ్లను గుర్తించి చోరీచేసినట్లు చెప్పారు. మొత్తం 6తులాల బంగారం, 1.5 తులాల వెండి, ఒక మొబైల్ ఫోన్, కొంత నగదును తస్కరించినట్లు తెలిపారు.

ఇందులో 5.5 తులాల బంగారం, 1.5 తులాల వెండి, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి జైలుకు పంపామన్నారు. 48 గంటల్లోనే కేసును ఛేదించిన మక్తల్ సీఐ చంద్రశేఖర్, మాగనూర్ ఎస్సై అబ్దుల్‌ఖాదర్, హెడ్ కానిస్టేబుల్ గోపికృష్ణ, కానిస్టేబుల్స్ రవీందర్, సాయికుమార్, రాజశేఖర్‌ను అభినందించారు. వీరికి త్వరలో రివార్డు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

డీఐఈవోను సస్పెండ్ చేయాలి

- కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకుల ఫిర్యాదు

పాలమూరు, జూన్ 24: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు తొత్తుగా మారిన జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సోమవారం కలెక్టర్ విజయేందిరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండానే ప్రైవేట్ కళాశాలల్లో తరగతి గదులపై హాస్టళ్లు నిర్వహిస్తున్నారన్నారు. ఈ వ్యవహారంపై డీఐఈవో శ్రీధర్‌సుమన్‌కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని డీఐఈవోను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్, ఉపాధ్యక్షుడు నందు, పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

నారాయణపేట టౌన్, జూన్ 24: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేశ్ అన్నారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో డీఈవో అబ్దుల్ ఘనికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు లాభార్జనే ధ్యేయంగా ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి చరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇంతియాజ్, నగర కార్యకర్తలు లక్ష్మణ్, వెంకటేశ్, సతీశ్, వరుణ్ ఉన్నారు.

పేటలో డీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

దేవరకద్ర రూరల్ (కౌకుంట్ల), జూన్ 24 : కౌకుంట్ల మండలం ముచ్చింతలకు చెందిన నరహరి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నీమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే జీఎంఆర్ బాధిత కుటుంబ సభ్యులకు శనివారం సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేయించిన రూ.2లక్ష50వేల ఎల్‌వోసీని అందజేశారు.

అథ్లెటిక్ విజేతకు అభినందన

దేవరకద్ర రూరల్ (చిన్న చింతకుంట), జూన్ 24 : ఇటీవల నిర్వహించిన రాష్ట్ర అథ్లెటిక్స్‌లో రజత, కాంస్య పతకాలు సాధించాడు. మండలంలోని అల్లీపూర్‌కు చెందిన నవీన్ సీనియర్ కేటగిరి విభాగంలో బంగారుపథకం, రజతపతకం, కాంస్యపతకం సాధించాడు. కాగా సోమవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నివాసంలో నవీన్‌ను అభినందించి సన్మానించారు. అనంతరం రూ.20వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

పేద విద్యార్థులకు సాయమందించాలి

మూసాపేట, జూన్ 24 : పేద విద్యార్థులకు సహాయం చేయాలని ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామానికి చెందిన గొల్లమధు, సురేష్‌బ్రదర్స్ నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. కాగా తుంకినీపూర్ పాఠశాలలో ఆవులశేఖర్ విద్యాసామగ్రిని అందజేశారు.

మిడ్జిల్ ఎస్సైగా జయప్రసాద్

మిడ్జిల్, జూన్ 24: మహబూబ్‌నగర్ డీఎస్‌బీ నుంచి మిడ్జిల్ ఎస్సైగా జయప్రసాద్‌ను బదిలీ చేశారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న ఆనంద్‌ను నారాయణపేట వీఆర్‌కు బదిలీ చేసినట్లు జిల్లా కార్యాలయం నుంచి ఆదేశాలు జారీచేశారు. ఎన్నికల సమయంలో బదిలీపై వచ్చిన ఎస్సై ఆనంద్ మండలంలో ఎలాంటి ఘటనలు కాకుండా చొరవ తీసుకున్నారు.

పిల్లలు వయస్సుతగ్గ బరువు ఉండాలి

భూత్పూర్, జూన్ 24 : పిల్లలు వయస్సు బరువు, ఎత్తు ఉండాలని మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ అన్నారు. సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నపిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. తల్లిఆరోగ్యంగా ఉంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సైదమ్మ, అంగన్‌వాడీ టీచర్ గౌసియా, ఏ